www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 10-6-2024

Tirupathi | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | తిరుపతి సిటీ

## కాణిపాకం.. కిటకిట



కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది. స్వామి దర్శనానికి వచ్చిన భక్తులతో ఉదయం నుంచే క్యూలన్నీ పూర్తిగా నిండిపోయాయి. దర్శనానికి నాలుగు గంటల సమయం పట్టింది.

- ఐరాల(కాణిపాకం)

# తగ్గిన 'నోటా'



తాజా ఎన్నికల్లో నోటాకు ఓట్లు తగ్గాయి. అభ్యర్థులెవరూ నచ్చకపోతే 'నోటా'కు ఓటు వేసే ఆప్షన్ను ఓటర్లకు కల్పిస్తూ 2014 ఎన్నికల్లో దీనిని ప్రవేశపెట్టారు. ఆ ఎన్నికలో ప్రజలకు అవగాహన లేక నోటా ఓట్లు తక్కువగా పోలయ్యాయి. 2019 ఎన్నికలు వచ్చేసరికి నోటా ఓట్ల శాతం అమాంతం పెరిగింది.

**గత ఎన్నికల్లో నోటాకు పోలైన ఓట్ల వివరాలిలా..**

| నియోజకవర్గం | 2024 | 2019 | 2014 |
|---|---|---|---|
| పుంగనూరు | 2904 | 3287 | 959 |
| నగరి | 1744 | 1688 | 458 |
| జీడీనెల్లూరు | 2125 | 2829 | 553 |
| చిత్తూరు | 1096 | 1340 | 539 |
| పూతలపట్టు | 1420 | 2103 | 783 |
| పలమనేరు | 2344 | 2561 | 2029 |
| కుప్పం | 2115 | 2905 | 905 |
| మొత్తం | 11,633 | 16,713 | 6,226 |

తక్కువ మెజార్టీతో గెలిచే అభ్యర్థుల విషయంలో నోటా కచ్చితంగా కీలక పాత్ర పోషిస్తుందని అంతా భావించారు. కూటమి గాలిలో జిల్లాలోని అభ్యర్థులంతా భారీ మెజార్టీతో గెలుపొందారు. దీంతో నోటా కీలకపాత్ర పోషించలేదనే చెప్పాలి. 2014 ఎన్నికలో 6226 ఓట్లు నోటాకు పోలవ్వగా.. ఆ సంఖ్య 2019 నాటికి 16713 ఓట్లకు పెరిగింది. తాజాగా 11,633 ఓట్లు మాత్రమే నోటాకు పోలయ్యాయి. గత ఎన్నికతో పోల్చుకుంటే నగరి తప్ప అన్ని నియోజకవర్గాల్లోనూ నోటా ఓట్లు తగ్గాయి.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

# కాంగ్రెస్.. కాస్త ఊరట

ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కొంత ఊరట లభించింది. 2019 ఎన్నికలతో పోలిస్తే కుప్పం మినహా మిగిలిన అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్వల్పంగా ఓటింగ్ శాతం పెరిగింది. నగరిలో నాలుగు వేల ఓట్ల మార్కును దాటింది. రాష్ట్ర విభజనకు కారణమైన కాంగ్రెస్‌పై రాష్ట్ర ప్రజల్లో ఆగ్రహం నెలకొన్న విషయం తెలిసిందే. నాటి కాంగ్రెస్ నేతలు, శ్రేణులు ప్రధానంగా వైసీపీకి మారారు. 2014, 2019 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు నిరాశజనకమైన ఫలితాలొచ్చాయి. షర్మిల ప్రభావమో.. లేదా వైసీపీపై తీవ్ర వ్యతిరేకతో గానీ చాలా నియోజకవర్గాల్లో గత ఎన్నికలకన్నా ఈసారి వెయ్యి నుంచి 1500 వరకు ఓట్లు పెరిగాయి. కుప్పంలో మాత్రం గత ఎన్నికల్లో 3839 ఓట్లు రాగా, ఈ ఎన్నికల్లో 2562 ఓట్లు మాత్రమే కాంగ్రెస్‌కు పోలయ్యాయి.

- చిత్తూరు రూరల్

**గత మూడు ఎన్నికల్లో నియోజకవర్గాల వారీగా కాంగ్రెస్‌కు పోలైన ఓట్ల వివరాలు**

| నియోజకవర్గం | 2014 | 2019 | 2024 |
|---|---|---|---|
| చిత్తూరు | 1122 | 1651 | 3197 |
| పూతలపట్టు | 1275 | 1254 | 2769 |
| పలమనేరు | 1903 | 1814 | 3992 |
| కుప్పం | 2785 | 3839 | 2562 |
| జీడీ నెల్లూరు | 1967 | 2279 | 2659 |
| నగరి | 5170 | 3357 | 4516 |
| పుంగనూరు | 2220 | 2007 | 3546 |



## ప్రకృతి సేద్యంతో
# విరగ్గాసిన మామిడి

- అందరికీ ఆదర్శంగా నిలిచిన రైతు మునీశ్వరయ్య దంపతులు

రసాయన ఎరువులు, మందులతో పెట్టుబడి పెరిగి.. నష్టపోయిన రైతులు సుభాష్ పాలేకర్ పద్ధతులను పాటించేందుకు ముందుకు వస్తున్నారు. ప్రకృతి సేద్యంవైపు అడుగులు వేస్తున్నారు. తక్కువ ఖర్చుతో గో ఆధారిత సహజ ఎరువులు, వాటి మిశ్రమాలతో కషాయం, నూనెలు తయారు చేసుకుంటూ భూసారాన్ని పెంచుతున్నారు. పర్యావరణాన్ని కాపాడుకుంటూ లాభాలు ఆర్జిస్తున్నారు. ఇలా పులిచెర్ల మండలానికి చెందిన ఓ రైతు దంపతులు ప్రకృతి సేద్యంతో అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. వాళ్లే బోడిరెడ్డిగారిపల్లి పంచాయతీ గౌరిశెట్టివారిపల్లెకు చెందిన మునీశ్వరయ్య, కల్పన దంపతులు. ఐదేళ్ల కిందట వీరు మూడు ఎకరాల మామిడి తోటలో ప్రకృతి సేద్యాన్ని మొదలు పెట్టారు. మొదట్లో లాభాలు కనిపించకపోయినా.. వెనకడుగు వేయలేదు. మొదట్లో మూడు ఎకరాల మామిడితోటలో కేవలం మూడు టన్నుల మామిడికాయలు వచ్చేవి. ఇప్పుడు అదే తోటల సుమారు 16 టన్నుల మామిడికాయలు కాస్తున్నాయి. తద్వారా అధిక లాభాలను ఆర్జిస్తున్నారు. రసాయన ఎరువులు వాడే మామిడిలో ఈ ఏడాది 15శాతం మాత్రమే పంట దిగుబడి వచ్చినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. అయితే ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించిన మునీశ్వరయ్య మామిడి తోటలో 70శాతం మేరకు దిగుబడి వచ్చింది. ఇలా.. ప్రకృతి సేద్య పద్ధతులను పాటించడం ద్వారా అధిక లాభాలు సాధించవచ్చని రైతు మునీశ్వరయ్య తెలిపారు. మొదట్లో తనకు లాభాలు రాకపోయినా, ప్రకృతి సేద్యమే మానవాళికి శరణ్యమని భావించి ముందడుగు వేశానని గుర్తుచేసుకున్నారు. అలా, ఓపికగా ఉండబట్టే ఇప్పుడు అధిక లాభాలు చూస్తున్నానని ఆయన ఆనందం వ్యక్తంచేశారు. ప్రభుత్వం పూర్తిస్థాయిలో మార్కెట్ సౌకర్యం కల్పిస్తే మరింత లాభాలు పొందవచ్చని అభిప్రాయపడ్డారు.

- కల్లూరు



ప్రకృతి సేద్యం చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్న రైతు మునీశ్వరయ్య, కల్పన దంపతులు

### రైతులూ.. ఇటువైపు మొగ్గు చూపండి

తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఆర్జించగలిగే సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు మొగ్గుచూపాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వాసు కోరారు. నాణ్యమైన ఆహారంతో పాటు కాలుష్యం లేని వాతావరణానికి ప్రకృతి సేద్యం ఎంతో తోడ్పాటునిస్తుందన్నారు. భవిష్యత్ తరాలకు ప్రకృతి వ్యవసాయమే మేలు చేస్తుందన్నారు.



డీపీఎం వాసు



# పలమనేరు
## కుప్పం/పుంగనూరు

## అమరనాథరెడ్డికి పలువురి అభినందనలు


అమరనాథరెడ్డికి అభినందనలు తెలుపుతున్న కాపునాడు చైతన్య తదితరులు

పలమనేరు, జూన్9 : ఎమ్మెల్యేగా గెలుపొందిన ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని ఆదివారం పలువురు కలిసి అభినందనలు తెలియజేశారు. పూలమాలలు, శాలువలతో ఘనంగా సన్మానించారు. పలువురు పుష్ప గుచ్ఛాలు అందజేశారు. అమరనాథరెడ్డిని కలిసిన వారిలో రాష్ట్రవాల్మీకి సంఘ కార్యదర్శి ఎల్.భాస్కర్, పలువురు వాల్మీకి సంఘ నాయకులు, యువ కాపు నాడు రాష్ట్ర అధ్యక్షులు పూలచైతన్య, జనసేన నాయకులు, పలమనేరు తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసినాథంనాయుడు, పంచాయితీరాజ్ శాఖ నుంచి లక్ష్మీపతియాదవ్, పోలీసుశాఖకు చెందిన సీఐ భాస్కర్, రాంభూపాల్, చలపతి, వి.కోట టీడీపీ నాయకులు రంగనాథ్, డాక్టర్ సురేష్, రాంబాబు, డాక్టర్ యుగంధర్, డీసీసీ మాజీ అధ్యక్షుడు, పలమనేరు బలిజ సంఘ నాయకులు సుధాకర్, కేజీఎఫ్‌కు చెందిన పారిశ్రామికవేత్త బుజ్జి, విశ్రాంత ఎంఈఓ వాసుదేవనాయుడు, ఉపాధ్యాయ సంఘ నాయకులు రామయ్య తదితరులు అమరనాథరెడ్డికి అభినందనలు తెలిపారు.

## నూతన ప్రభుత్వానికి విశ్రాంత ఉద్యోగుల శుభాకాంక్షలు


సమావేశంలో మాట్లాడుతున్న గురురాజారావు

పలమనేరు, జూన్9: నూతనంగా ఏర్పాటు కానున్న ప్రభుత్వానికి పలమనేరు నియోజకవర్గ రిటైర్డు ఉద్యోగుల సంఘం అభినందనలు తెలిపింది. ఆదివారం పలమనేరులో రిటైర్డు ఉద్యోగుల కార్యవర్గ సమావేశం జరిగింది. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న సంఘ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గురురాజారావు మాట్లాడుతూ ఐదేళ్లుగా రాష్ట్రంలోని 14 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికులు తీవ్రమైన మానసిక క్షోభను అనుభవించారన్నారు. కనీసం జీతాలు, పెన్షన్లు సకాలంలో అందక తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. అంతేగాకుండా జూలై 2018 నుంచి ఈనాటి వరకు చెల్లించాల్సిన 8 విడతల డీఆర్ బకాయిలు, ఏప్రిల్ 2020 నుంచి డిసెంబరు 2021 వరకు చెల్లించవలసిన పీఆర్‌సీ బకాయిలు, రిటైర్డు అయిన వారికి చెల్లించవలసిన రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ సుమారు రూ.25 వేల కోట్లు చెల్లించకుండా ఆ నిధులను పక్కదారి పట్టించారని వివరించారు.

**రామోజీరావుకు నివాళులు**

ఈనాడు సంస్థల అధినేత రామోజీరావుకు విశ్రాంత ఉద్యోగులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గౌస్, క్రిష్ణమూర్తి, ఆర్ముగంశెట్టి, అక్బర్‌బాషా, గురుస్వామినాయుడు, త్యాగరాజులునాయుడు, మోహన్, మస్తాన్, వినాయకం, మాలతి, ఆదెమ్మ, శైలజకుమారి, సరస్వతమ్మ, చంద్రశేఖర్, రామానాయుడు, రాజారెడ్డి, చక్రపాణి శెట్టి, చెంగప్ప, సుబ్రమణ్యం, నిజాంసాహెబ్ పాల్గొన్నారు.

## విరివిగా మొక్కలు పెంచాలి



పలమనేరు, జూన్9 : ప్రార్థనా స్థలాల్లో ఖాళీగా ఉన్న చోట విరివిగా మొక్కలు నాటి హరిత వనాలుగా మార్చేందుకు అందరూ కృషిచేయాలని ప్రకృతి సంస్థ కన్వీనర్ మల్లి చెట్ల దేవేంద్ర పిలుపు నిచ్చారు. ఆదివారం సీఎస్ఐ ట్రస్టు ఏర్పడి 77 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పలమనేరులో కొత్తగా నిర్మించిన సీఎస్ఐ చర్చి ఆవరణలో వారి కోరిక మేరకు 77 మొక్కలు నాటారు. అనంతరం దేవేంద్ర మాట్లాడుతూ మొక్కలను నాటడం, పెంచడం, సంరక్షించడం అంటే దేవుడికి సేవ చేసినట్లేనని వివరించారు. పాస్టర్ సురేష్, కార్యదర్శి, నిర్వాహకులు పాల్గొన్నారు.

## జనసేన విజయోత్సవాలు



గుడుపల్లె, జూన్ 9: ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించడంతో గుడుపల్లె మండల కేంద్రంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ మండలాధ్యక్షుడు అమీర్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఆదివారం సంబరాలు చేసుకున్నారు. పార్టీ కార్యాలయం ఎదుట టపాకాయలు పేల్చారు. అనంతరం జయ జయ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందని తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.

## సోమలలో కూటమి విజయోత్సవ ర్యాలీ

సోమల, జూన్ 9: ప్రధాన మంత్రిగా నరేంద్రమోదీ మూడో పర్యాయం ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా ఆదివారం సోమల బస్టాండ్‌లో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కేక్ కట్‌చేసి రంగులు చల్లుకున్నారు. అనంతరం అభయాంజనేయస్వామి ఆలయం నుంచి సోమల, అడుసుపల్లె, నంజంపేట, కమ్మపల్లె వరకు బైక్ ర్యాలీ జరిపారు. ఈ కార్యక్రమంలో పుంగనూరు బీజేపీ కన్వీనర్ గన్నా మదన్‌మోహన్, టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, జనసేన అధ్యక్షుడు నాగభూషణం రాయల్, ఉమాపతినాయుడు, శ్రీనివాసులు నాయుడు, రమేశ్‌నాయుడు, వేణు గోపాల్ నాయుడు, విశ్వనాథం, సుబ్బరాయుడు, పి.శ్రీనివాసులు, శంకర్, మునిచంద్రయ్య, హరిప్రసాద్, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి సేవలో బోయకొండ మాజీ చైర్మన్ ఎస్‌కేఆర్


ప్రసాదాలు అందుకుంటున్న ఎస్‌కే వెంకటరమణారెడ్డి

చౌడేపల్లె, జూన్9: ప్రముఖ పుణ్య క్షేత్రమైన బోయకొండ గంగమ్మను ఆలయ మాజీ చైర్మన్ ఎస్‌కే వెంకట రమణారెడ్డి దర్శించుకున్నారు. ఆదివారం ఆయనతో పాటు రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు అసూరి బాలాజి, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి జల్లి మనోహర్‌లు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు వారికి అమ్మవారి తీర్థప్రసాదాలు అందించారు. ● అలాగే కూటమి ఘన విజయం సాధించటంతో టీడీపీ మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు ఆయనకు తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బోయకొండ సుబ్బు, గిరిరాజు, ప్రభాకర్, రెడ్డి, రవినాయుడు తదితరులు పాల్గొన్నారు

## కంటివైద్యశిబిరానికి విశేషస్పందన

బైరెడ్డిపల్లె, జూన్ 9 : బైరెడ్డిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం చెన్నై శంకరనేత్రాలయ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటివైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యనిపుణులు 78మందికి కంటిపరీక్షలు జరిపి 38మందిని శస్త్రచికిత్సలకు ఎంపికచేశారు. డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ శ్రీనివాసులు, చంద్ర, చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

## అక్షర యోధుడికి ఘన నివాళి

చౌడేపల్లె, జూన్9: ఈనాడు సంస్థల అధినేత రామోజీరావుకు చౌడేపల్లె ప్రెస్‌క్లబ్ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. ఆదివారం చౌడేపల్లె బస్టాండ్‌లో పాత్రికేయులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు.

## మాజీ సైనికుల సంక్షేమ సంఘ అధ్యక్షుడిగా రెడ్డెప్ప



సుకుమార్‌బాబు, రెడ్డెప్ప

పుంగనూరు, జూన్ 9: పుంగనూరు మాజీ సైనికుల సంక్షేమ సంఘ అధ్యక్షుడిగా సి.రెడ్డెప్పను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం పుంగనూరులో జరిగిన మాజీ సైనికుల సంఘ కార్యవర్గ సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ గౌరవాధ్యక్షుడిగా కె.సుకుమార్ బాబు, అధ్యక్షుడిగా రెడ్డెప్ప, ఉపాధ్యక్షుడిగా జవహర్, కార్యదర్శిగా ఎన్.ప్రతాప్‌ను ఎన్నుకున్నట్లు సుకుమార్ బాబు తెలిపారు. నూతన కమిటీ మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని ఆయన వివరించారు.

## వాషింగ్టన్ డీసీలో టీడీపీ సంబరాలు



రామకుప్పం, జూన్ : టీడీపీ కూటమి గెలుపుతో యూఎస్ఏలోని వాషింగ్టన్ డీసీలో రామకుప్పం మాజీ ఎంపీపీ ఆంజినేయప్ప భార్య ప్రభావతి, కుమారుడు సతీష్, కోడలు చైత్ర ఆధ్వర్యంలో అక్కడి తెలుగుమహిళలు సంబరాలు నిర్వహించారు. సైకిల్‌ను ముందుపెట్టి, కేక్ కట్‌చేసి హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధితో బాటూ, మహిళా సంక్షేమం సాకారమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## రేపు వాహనాల వేలం

పలమనేరు, జూన్9 : మద్యం కేసుల్లో పట్టుబడిన వాహనాలను పలమనేరు ఎస్ఈబీ స్టేషన్ ఆవరణలో ఈ నెల 11వ తేదీ మంగళవారం వేలం వేయనున్నట్లు పలమనేరు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ కె.సురేష్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు మంగళవారం ఉదయం ఎస్ఈబీ స్టేషన్‌కు వచ్చి నిర్దేశించిన డిపాజిట్ మొత్తం చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని వివరించారు. వేలంలో పాల్గొనేవారు తప్పనిసరిగా ఆధార్‌కార్డు తీసుకురావాలన్నారు.

## గుంతలకు మరమ్మతులు



శాంతిపురం, జూన్ 9: శాంతిపురంలోని కేజీఎఫ్ రోడ్డు వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు గుంతలమయమైంది. వాహనదారులు ఇబ్బందులు పడేవారు. వాహనదారులు ప్రమాదాల బారినపడ్డారు. ఈ విషయం తెలుసుకొన్న టీడీపీ మండలాధ్యక్షుడు విశ్వనాథంనాయుడు తన టీమ్ సభ్యులతో ఆదివారం గుంతలు ఏర్పడిన ప్రాంతంలో కాంక్రీట్ వేసి గుంతలను పూడ్చారు.

## భగవద్గీతపై ప్రచారం

పలమనేరు, జూన్9 : పలమనేరు మున్సిపాలిటీ గొబ్బిళకోటూరు గ్రామంలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక ప్రచార కార్యక్రమం నిర్వహించింది. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇందూజ్ఞానవేదిక పలమనేరు, బంగారుపాళ్యం కమిటీ అధ్యక్షులు భాస్కర్, బాలాజీ, సభ్యులు ఉదయ్, రేఖ, కళ్యాణి, జీవరత్న, వింధ్య, హేమంత్, జ్యోతి, రెడ్డెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ నేత మోహన్‌రెడ్డికి పితృవియోగం



బైరెడ్డిపల్లె, జూన్ 9 : మండలంలోని మేకలనాగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన టీడీపీనాయకుడు మోహన్‌రెడ్డి తండ్రి ఓబుల్‌రెడ్డి శనివారం రాత్రి మృతిచెందారు. ఓబుల్‌రెడ్డి మృతిపట్ల టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి సంతాపం తెలిపారు. ఆదివారం ఓబుల్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పించారు. వారి కుటుంబీకులను పరామర్శించారు.

## బైరెడ్డిపల్లెలో టీడీపీ నేతలకు సన్మానం



బైరెడ్డిపల్లె, జూన్ 9 : ఎన్నికల్లో టీడీపీ విజయదుందుభి మోగించి అధికారంలోకి రావడంతో అభిమానుల సంబరాలు కొనసాగుతూనే ఉన్నాయి. బైరెడ్డిపల్లెలో ఆదివారం టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధానకార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి, మాజీ ఎంపీపీ కృష్ణవేణిజైకుమార్ తదితర ముఖ్యనేతలను వివిధ పంచాయతీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈసారి ఎన్నికల్లో బైరెడ్డిపల్లె మండలంలో టీడీపీ మంచి మెజారిటీ సాధించడంతో వారు నాయకులను సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ టీడీపీ కూటమి గెలుపుకోసం సైనికుల్లా పనిచేసిన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు.

## అరాచక పాలనకు చెంపపెట్టులా ప్రజాతీర్పు: టీడీపీ


విజలాపురం పంచాయతీ బాలఓబనపల్లెలో పతాకావిష్కరణలో నేతలు

రామకుప్పం, జూన్ 9: రాష్ట్రంలో వైసీపీ ఐదేళ్ల అరాచక పాలనకు చెంపపెట్టులా ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇచ్చారని టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహకకార్యదర్శి పత్ర నారాయణాచారి, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షడు చలపతి, పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షుడు ఆంజినేయరెడ్డి తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని కెంచనబల్ల, మణీంద్రం, విజలాపురం, బల్ల పంచాయతీల్లోని పలుగ్రామాల్లో టీడీపీ శ్రేణులు విజయోత్సవాలు అట్టహాసంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సంబరాల్లో పాల్గొన్న నేతలు మాట్లాడుతూ వైసీపీ పాలన అభివృద్ధిరహితంగా, అరాచకాలు, అవినీతి, దౌర్జన్యాలమయమైందన్నార. వైసీపీ పాలకులు, ఆ పార్టీ శ్రేణులు అన్నివర్గాలపై దాడులకు పాల్పడ్డారన్నారు. సహనంతో భరిస్తూ వచ్చిన జనం ఓటుతో బుద్ధి చెప్పారన్నారు. అభివృద్ధి, పేదల సంక్షేమం టీడీపీ కూటమికే సాధ్యమని అచంచల విశ్వాసంతో అన్ని ప్రాంతాల్లో కూటమికి ఘనవిజయం చేకూర్చారన్నారు. ప్రజల ఆశలను వమ్ము చేయకుండా కూటమి పాలన సాగుతుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో తెలుగుయువత మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం, కుప్పం మాజీ జడ్పీటీసీ రాజకుమార్, నేతలు కాణిపాకం వెంకటేష్, శ్రీనివాసులురెడ్డి, వెంకటరమణ, రామలింగారెడ్డి, జ్ఞానశేఖర్‌రెడ్డి, శ్రీరాములురెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రమేష్, కుమార్, ఎర్రప్ప, హనుమంతు, శ్రీనివాసులు, బాలరాజు, సుబ్రీ, నరసింహ, సతీష్, అవినాశ్ తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డు అధ్యక్ష పీఠంపై పలువురి కన్ను

పలమనేరు, జూన్9 : పలమనేరు మార్కెట్ యార్డు అధ్యక్ష పదవి కోసం పలువురు ఆశావహులు ఎదురు చూస్తున్నారు. పలమనేరు నియోజకవర్గ స్థాయి పదవి కావడంతో ఈ పదవి కోసం పలువురు టీడీపీ నాయకులు ఆశలు పెట్టుకొన్నారు. నియోజకవర్గంలోని వికోట మండలానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ రామచంద్రనాయుడు ఇదివరకే ఈపదవిలో కొనసాగారు. ప్రస్తుతం ఆయన మరోసారి ఈ పదవిని ఆశిస్తున్నారు. ఈయనతో పాటు ఇదే మండలానికి చెందిన రంగనాథ్ పేర్లు వినిపిస్తున్నాయి. ఇక బైరెడ్డిపల్లి మండలానికి చెందిన మాజీ ఎంపీపీ క్రిష్ణవేణి, ఆమెభర్త,మాజీ సర్పంచ్ బిఎస్ జయకుమార్ పేర్లు వినిపిస్తున్నాయి. అదేవిధంగా పలమనేరు మండలానికి చెందిన పలమనేరు మార్కెట్ కమిటీ మాజీ వైస్ ప్రెసిడెంట్ బ్రహ్మయ్య, ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ అధ్యక్షుడు బాలాజినాయుడు, మరో నాయకుడు జగదీష్‌నాయుడు, గంగవరం మండల సీనియర్ నాయకులు వెంకటరమణారెడ్డి కూడా ఈ పదవిని ఆశిస్తున్నారు. ఇక అమరనాథరెడ్డి సొంత మండలానికి చెందిన మాజీ ఎంపీపీ విజయభాస్కర్ రెడ్డి ఆ మండల ఎంపీపీ పదవి ఆశిస్తే ఆ పదవికే పరిమితం కావచ్చని లేనిపక్షంలో ఆయన కూడా మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఆశించే అవకాశం ఉందని తెలుస్తోంది.

## అలరించిన దుర్యోధన వధ



సోమల, జూన్ 9: మండలంలోని భారతంమిట్టలో మహాభారత యజ్ఞంలో భాగంగా ఆదివారం దుర్యోధన వధ ఘట్టం భక్తులను ఆకట్టుకుంది. ఉదయం భాగవతారిణి గీతావాణి భక్తులకు దుర్యోధన వధ ఘట్టం భక్తులకు వినిపించారు. ఈ క్రమంలో ఆలయంలో ఉభయదారులు మేకల రాజన్న, గంగాధరం, వాసు, చంద్ర, కనకరత్న, వెంకట్రమణ కుటుంబసభ్యులు పాండవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పాండవ ఉత్సవ మూర్తులను వడ్డిపల్లె, దాసరివారిపల్లె, పాయలవారిపల్లె, రాశెట్టివారిపల్లె, గన్నావారిపల్లెల్లో ఊరేగించారు. అనంతరం ఆలయం వద్ద దుర్యోధనుడి ప్రతిమను బంక మట్టితో తీర్చిదిద్దారు. పరిసర గ్రామాల భక్తులు తరలి వచ్చి పూజలు జరిపారు. సాయంత్రం పీలేరు వెంకటేశ్వర నాటక మండలి సభ్యులు దుర్యోధనుడు, భీమసేనుడు పాత్రదారులు యుద్ధ ప్రదర్శనను రక్తి కట్టించారు. దుర్యోధనుడు ఆలపించిన పద్యాలు భక్తుల కంట కన్నీరు తెప్పించాయి. అనంతరం ధర్మరాజు పట్టాభిషేకం వేడుకలు ఉభయదారులు పెద్దరెడ్డెప్ప ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

## ఎస్టీయూను బలోపేతం చేయాలి


ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహిస్తున్న టీచర్లు

పుంగనూరు రూరల్, జూన్ 9: ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో రాజీలేని పోరాటం చేస్తున్న ఎస్టీయూ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఆ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి బి.మోహన్ పిలుపునిచ్చారు. ఆదివారం పుంగనూరు ఎమ్మార్సీ ఎదుట ఎస్టీయూ పతాకాన్ని ఆవిష్కరించి ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం రాకమునుపే నిజాం నిరంకుశ పాలనను వ్యతిరేకించి 1947 జూన్ 9వ తేదీ ఆవిర్భవించిన ఘనచరిత్ర ఎస్టీయూకు ఉందన్నారు. రాష్ట్రంలో ఏర్పడే నూతన ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. కొత్త ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని, ఆర్థిక బకాయిలు వెంటనే విడుదల చేయాలని, పీఆర్సీని ప్రకటించి 117 జీవోను రద్దు చేసి విద్యావ్యవస్థలో మార్పులు తీసుకు రావాలని కోరారు. చౌడేపల్లె, పుంగనూరు మండల ఎస్టీయూ కన్వీనర్లు సుమిత్ర, దీపారాణి మాట్లాడుతూ సంఘంలో మహిళా సభ్యుల భాగస్వామ్యం అధికంగా ఉండాలని, సంఘాన్ని మరింత పటిష్టం కావడానికి కొత్తసభ్యులు చేరాలని కోరారు. ఎస్టీయూ డివిజన్ కన్వీనర్ టి.నారాయణస్వామి ఎస్టీయూ ప్రగతి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు శ్రీధర్, మంజునాథ్, సుధాకర్, నరేంద్ర, శంకర్, శ్రీనివాసులు, శ్రీరాములరెడ్డి, ఖాదర్‌బాషా, రామకృష్ణ, కృష్ణకుమారి, మధుసూదన్, సుమల పాల్గొన్నారు.

## కార్మిక సంక్షేమం బాధ్యత మాదే: టీడీపీ


సత్కారం చేసిన కార్మికులతో రాజ్‌కుమార్

కుప్పం, జూన్ 9: కార్మికుల సంక్షేమం బాధ్యత రాష్ట్రంలో ఏర్పడబోయే టీడీపీ ప్రభుత్వం చూసుకుంటుందని ఆ పార్టీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ అన్నారు. కుప్పంలోని చంద్రన్న కార్మిక సంక్షేమ భవనంలో టీడీపీ ఘన విజయాన్ని పురస్కరించుకుని రాజ్‌కుమార్‌తోపాటు పలువురు పార్టీ నాయకులను కార్మికులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు ఎల్లప్పుడూ చంద్రబాబు అండగా ఉంటూ వచ్చారని గుర్తు చేశారు. ఈ కార్మిక భవనాన్ని కూడా టీడీపీ హయాంలోనే నిర్మించిన విషయం అందరికీ గుర్తుండే ఉంటుందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే కార్మికుల సంక్షేమంకోసం పలు చర్యలు తప్పకుండా చంద్రబాబు తీసుకుంటారని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాణిపాకం వెంకటేశ్, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## నల్లారి కిశోర్‌కు సన్మానం



పుంగనూరు రూరల్, జూన్ 9: పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ఘన విజయం సాధించడంతో పుంగనూరు టీడీపీ ఎస్సీసెల్ నాయకుడు రామయ్య సన్మానం చేసి అభినందనలు తెలిపారు. ఆదివారం అన్నమయ్య జిల్లా కలికిరి నగిరిపల్లెలో కిశోర్‌కుమార్‌రెడ్డిని టీడీపీ నేత రామయ్య, పుంగనూరు బీఎస్పీ నాయకుడు సురేశ్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## విద్యార్థులు కళారంగంలో రాణించాలి



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

గంగవరం, జూన్ 9 : విద్యార్థులు చదువుతో పాటు తమకు ఆసక్తివున్న కళారంగంలో రాణించి గుర్తింపు సాధించాలని పలమనేరు తెలుగు సాహిత్య, సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసినాథం నాయుడు కోరారు. గంగవరం కళామందిరంలో ఆదివారం తెలుగు సాహిత్య, సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో విద్యార్థుల్లో దాగివున్న కళాప్రతిభను వెలికితీయడానికి సాంస్కృతిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శాస్త్రీయ, భక్తి, సంప్రదాయ నృత్యాలతో అలరించిన కళాతరంగిణి సంస్థ చిన్నారులను తులసినాథంనాయుడు అభినందించి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అలాగే తెలుగుభాషాభివృద్ధికి విశేషకృషి చేస్తున్న తులసినాథం నాయుడుకు కళాతరంగిణి సంస్థవారు తెలుగుభాషా సేవాపురస్కారాన్ని అందజేసి సత్కరించారు. నిర్వాహకులు పుష్ప, మాధవరెడ్డి, జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, చంద్రశేఖరయ్య, శ్రీపురం సీతారామయ్య, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## మట్టి తరలింపు.. అడ్డుకున్న టీడీపీ నాయకులు



కల్లూరు, జూన్9: పులిచెర్ల మండలం పాతపేట పంచాయతీలోని ఎల్లప్ప చెరువులో అక్రమంగా తరలిస్తున్న మట్టిని ఆదివారం స్థానిక టీడీపీ నాయకులు మునికృష్ణ, కడియాల సుబ్రహ్మణ్యం, హరికృష్ణ అడ్డుకున్నారు. చెరువులోని మట్టిని తరలిస్తుండగా సమాచారం అందుకున్న టీడీపీ నాయకులు చెరువు వద్దకు చేరుకున్నారు. మట్టిని తరలిస్తుండడంపై స్థానిక వీఆర్వో శకుంతలకు ఫిర్యాదు చేశారు. వీఆర్వో వెంటనే స్పందించి చెరువు వద్దకు చేరుకుని మట్టి తరలింపును ఆపించారు. పలు చెరువుల్లో యథేచ్ఛగా మట్టిని తరలిస్తున్నారని తెలియజేశారు.

## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవు : డీఎస్పీ

చౌడేపల్లె, జూన్9: శాంతి భద్రతలకు ఎవరైనా సరే విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని పలమనేరు డీఎస్పీ విష్ణురఘువీర్ హెచ్చరించారు. ఆదివారం ఆయన స్థానిక బస్టాండులో కొందరు ఆకతాయిలు ప్రజలకు ఇబ్బంది పెట్టేలా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలిగించినా ఉపేక్షించబోమని హెచ్చరించారు. ప్రజలు ప్రశాంతంగా ఉండాలని శాంతియుత జీవనం సాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పుంగనూరు రూరల్ సీఐ కృష్ణారెడ్డి, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ధరలు లేక బంతిపూల రైతులు విలవిల


గుడుపల్లె చెరువులో ధరలు లేక పడేసిన బంతి పూలు

గుడుపల్లె, జూన్ 9: బంతి పూల ధరలు పడిపోవడంతో రైతులు విలవిలలాడు తున్నారు. మండలంలో సంవత్సరం పొడవునా రైతులు చామంతి, బంతి, రోజా, లిల్లి పూలను సాగుచేస్తుంటారు. వారం రోజులుగా బంతి పూల ధర కిలో రూ.50 నుంచి రూ.5కు పడిపోయింది. రైతులు పూలను కుప్పం మార్కెట్‌కు తెస్తే ధరల తగడంతో వ్యాపారులు కొనుగోలుకు మొగ్గు చూపడంలేదు. వారం రోజులుగా వర్షం కురుస్తుండడంతో పూలలో తేమ శాతం అధికంగా ఉండడంతో కొనడానికి వెనకడుగు వేస్తున్నారు. దీంతో రైతులు మార్కెట్‌లో గంటల కొద్దీ నిరీక్షించి పూలు అమ్ముడు కాకపోవడంతో మార్కెట్ బయటే పార బోస్తు న్నారు. మరికొందరు తమ గ్రామాల సమీపంలోని రోడ్లపై పూలను పారబోసి గ్రామాలకు వెనుదిరుగుతున్నారు. ఇంకొందరు రైతులు పూలను తోటల్లో కోయకుండానే పశువులకు మేతగా వదిలేస్తున్నారు. అప్పులు చేసి కష్టపడి పండిస్తే ధరలు లేకపోవడంతో తమకు అప్పులే మిగిలాయని బంతిపూల రైతులు వాపోతున్నారు.

## బీజేపీ నాయకుల సంబరాలు


సదుంలో కూటమి శ్రేణుల సంబరాలు

చౌడేపల్లె, జూన్9: నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానిగా ప్రమాణస్వీకారం చేయడంతో బీజేపీ కన్వీనర్ మదన్‌మోహన్ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. ఆదివారం స్థానిక బస్టాండ్‌లో వారు టపాకాయలు పేల్చి, ప్రజలకు కార్యకర్తలకు స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కడియాల మనోహర్, గంధోడి ప్రవీణ్, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**సదుం:** మండల టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి శ్రేణులు స్థానిక బస్టాండు కూడలిలో బాణాసంచా పేల్చి స్వీట్లు పంచారు. వెంకటరమణారెడ్డి, మారుతి రెడ్డి, హరిబాబు, పవన్‌కుమార్, రత్న, సాయికుమార్, వై.రమణారెడ్డి, వై.మునిరెడ్డి, పాల్గొన్నారు.

**కల్లూరు:** పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లెలో టీడీపీ, జనసేన పార్టీ నాయకులు పాలేటమ్మ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోపినాయుడు, సురేష్, బాలకృష్ణ, జయచంద్రనాయుడు, పరంధామనాయుడు, దేవ, శంకర తదితరులు పాల్గొన్నారు.


పుంగనూరులో కేక్ కట్ చేస్తున్న బీజేపీ నాయకులు

**పుంగనూరు రూరల్:** పుంగనూరులోని ఎన్టీఆర్ సర్కిల్‌లో బీజేపీ కన్వీనర్ మదన్‌మోహన్‌బాబు, నాయకులు రాజారెడ్డి, కుమార్ తదితరులు కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు.

# రోడ్డు ప్రమాదాల్లో వన్యప్రాణుల బలి

**నివారణకు చర్యలు చేపట్టని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు**

**అటవీ సంరక్షణ గాలికొదిలేశారు. వేసవిలో ఆకతాయిలు పెట్టే నిప్పుతో వందలాది ఎకరాల్లో చెట్లు కాలిపోతున్నాయి. ఫైర్ ట్రాక్‌లు లేకపోవడంతో మంటలు అదుపుకాని పరిస్థితి. దీంతో ఆహారం కోసం పొలాల్లోకి వచ్చే వన్యప్రాణులు.. రోడ్డు దాటే సమయంలో వాహనాలు ఢీకొని మృత్యువాత పడుతున్నాయి.**

**- పలమనేరు**





పలమనేరు సమీప జాతీయరహదారిపై లారీ ఢీకొని మృతిచెందిన ఏనుగులు, వాహనం ఢీకొనడంతో మృతిచెందిన దుప్పి (ఫైల్ ఫొటోలు)

అటవీ ప్రాంతంలో వన్యప్రాణులకు ఆహారం, తాగునీటి వసతి కల్పనలో ప్రభుత్వాలు విఫలమయ్యాయి. వన్యప్రాణులు.. ముఖ్యంగా ఏనుగులు, దుప్పులు, అడవిపందులు, అటవీ సరిహద్దు గ్రామాల్లో చెరకు, వరి, రాగి, అరటి తోటలపై దాడి చేస్తున్నాయి. రాత్రివేళల్లో వచ్చి తిని, పంటలను నాశనం చేస్తుండటంతో పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లోని అటవీ సమీప గ్రామాల రైతులు చెరకు, రాగి సాగు నిలిపేశారు. ఏనుగుల దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టలేదు. 100 కిలోమీటర్లకు పైగా కందకాలు తవ్వినా ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయింది. సోలార్ విద్యుత్ కంచెకూడా కొంతకాలం సత్ఫలితాలిచ్చినా దాని నిర్వహణ సక్రమంగా లేక నిరర్ధకమైంది. రెండేళ్లక్రితం అటవీ సరిహద్దుల్లో హ్యాంగింగ్ సోలార్ విద్యుత్ కంచె ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ కంచె మంచి ఫలితాలనిస్తుందని అధికారులు గుర్తించి దీన్ని పూర్తి స్థాయిలో అటవీ సరిహద్దులో ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా నిధులు రాకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి.

**అండర్‌బ్రిడ్జిల ఏర్పాటు ప్రతిపాదనలకే సరి**

పలమనేరు కౌండిన్య శాంచురీ ప్రాంతంలో జాతీయ రహదారి ఉంది. ఈ అడవినుంచి మరో ప్రాంతానికి వన్యప్రాణులు వెళ్లాలంటే తప్పనిసరిగా రోడ్డు దాటాల్సిందే. ఆహారం కోసం వన్యప్రాణుల సంచారం రాత్రిళ్లే ఎక్కువ. దీంతో వన్యప్రాణులు ఈ రహదారులను దాటే సమయంలో అతి వేగంగా వెళ్లే భారీ వాహనాలు ఢీకొనడంతో మృత్యువాత పడుతున్నాయి. గతేడాది పలమనేరు సమీపంలోని బూతలబండ వద్ద రోడ్డు దాటుతున్న మూడు ఏనుగులను లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే చనిపోయాయి. ఈ ఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. ఇక చిన్నచిన్న దుప్పులు లెక్కలేన్నన చనిపోతూనే ఉన్నాయి. దీంతో అధికారులు వన్యప్రాణులు రహదారులను దాటే ప్రాంతాలను గుర్తించారు. అక్కడ అండర్ బ్రిడ్జిలు నిర్మిస్తే సురక్షితంగా రోడ్డుదాటుతాయని భావించారు. ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రతిపాదనలు పంపారు. ఇవి కూడా అటకెక్కిపోయాయి.

**ఎక్స్‌ప్రెస్ హైవేతో మరింత అలజడి**

చెన్నై- బెంగళూరుకు కొత్తగా నిర్మిస్తున్న ఎక్స్‌ప్రెస్ హైవే పనులతోనూ వన్యప్రాణులకు హాని కలుగుతోందని వన్యప్రాణి ప్రేమికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ముఖ్యంగా కౌండిన్య శాంచురీ ప్రాంతంలో ఈ రహదారి పనులు చేపట్టారు. దాదాపు 100 అడుగుల వెడల్పుకంటే ఎక్కువగా చెట్లను నరికి కొత్తరోడ్డు వేస్తున్నారు. రోడ్డు నిర్మాణానికి అడ్డుగా వచ్చే పెద్ద పెద్ద బండరాళ్లను పేల్చి.. చదును చేస్తున్నారు. ఈ పేలుడు శబ్దాలతో అడవిలోని వన్యప్రాణులు చెల్లాచెదురవుతున్నాయి. ఇవి ప్రాణభయంతో పరుగులు పెడుతూ రహదారులపైకి రావడంతో గుర్తుతెలియని వాహనాలు ఢీకొంటున్నాయి. రహదారి పనులు బంగారుపాళ్యం, పలమనేరు, బైరెడ్డిపల్లె మండలాల పరిధిలోని అటవీ ప్రాంతాల్లో జరుగుతోంది. వన్యప్రాణుల మృతికి ఇదికూడా కారణమని పలువురు అంటున్నారు.

**అడవికి నిప్పుపెట్టడంతో..**

సాధారణంగా వేసవిలో అటవీ ప్రాంతంలోని చెట్లు ఆకులు రాల్చివేస్తాయి. ఆ సమయంలో పశువుల కాపర్లు కొందరు, జాతీయ రహదారిపై వెళ్లే వాహన చోదకులు కొందరు సిగరెట్లు తాగి ఎండిపోయిన ఆకులకు నిప్పు రగిల్చి వెళ్లిపోతున్నారు. ఇలా ఒక చోట పెట్టిన నిప్పు విస్తరించి ఎకరాల కొద్దీ చెట్లు కాలిపోతున్నాయి. దీంతో ఈ ప్రాంతంలో నేడు వందలాది ఎకరాల్లో అడవి బీడుభూమిగా దర్శనమిస్తోంది. దశాబ్దం కిందట వేసవిలో అటవీ సరిహద్దు గ్రామాల ప్రజలతో అధికారులు సమావేశాలు నిర్వహించేవారు. చెట్ల ప్రాధాన్యాన్ని వివరించి.. అడవిని కాపాడుకొనేలా అవగాహన కల్పించేవారు. ఎవరైనా అడవికి నిప్పు పెట్టారని తెలిస్తే చర్యలు చేపడతామని హెచ్చరించేవారు. రహదారి వెంబడి తరచూ క్షేత్రస్థాయి సిబ్బంది సంచరిస్తూ వాహనదారులపై నిఘా వేసేవారు. దశాబ్ద కాలంగా ఇటువంటి చర్యలు లేవు. గతంలో అడవిలో అక్కడక్కడా సుమారు 10 అడుగుల వెడల్పుతో ఫైర్‌ట్రాక్ ఏర్పాటు చేసేవారు. దీంతో ఒకచోట ఎవరైనా నిప్పు పెట్టినా ఈ ఫైర్‌ట్రాక్ వద్దకు వచ్చిమంటలు ఆగిపోయేవి. ఆ తర్వాత ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఈ ఫైర్‌ట్రాక్‌లను ఏర్పాటు చేయడంలేదు. దీంతో ఇప్పుడు ఒకచోట అగ్ని ప్రమాదం సంభవిస్తే వందలాది ఎకరాల్లో చెట్లు కాలిపోతున్నాయి.

## ఆగని గజదాడులు



మామిడి చెట్లను ధ్వంసం చేసిన ఏనుగులు

కల్లూరు, జూన్ 9: పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయి. దీంతో మామిడి, కొబ్బరి, తదితర పంటలకు అపార నష్టం వాటిల్లింది. మండలంలోని కమ్మపల్లె పంచాయతీ దేశిరెడ్డిగారిపల్లెకి చెందిన మాజీ సర్పంచ్ రవీంద్రనాథ్‌రెడ్డి పొలంలోకి శనివారం రాత్రి ప్రవేశించిన ఏనుగుల గుంపు 20 మామిడి చెట్లను విరిచేశాయి. సుమారు నాలుగు టన్నుల మామిడికాయలను నేలరాల్చాయి. పలు కొబ్బరి చెట్లను విరిచేశాయి. ఏడు ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేసినట్లు స్థానిక రైతులు తెలిపారు. అటవీ అధికారులు స్పందించి ఏనుగుల బారి నుంచి పంటలను రక్షించాలని రైతులు కోరుతున్నారు.

## విద్యారంగాన్ని బలోపేతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఐరాల, జూన్ 9: నూతనంగా ఏర్పడనున్న ప్రభుత్వం ఉపాధ్యాయులతో స్నేహంగా మెలుగుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు కోరారు. ఆదివారం నాంపల్లెలోని కల్యాణ మంటపంలో యూటీఎఫ్ ఉపాధ్యాయులు సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల ఔన్నత్యాన్ని పెంచే విధంగా ప్రభుత్వ పోకడలు ఉండాలన్నారు. ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. పాఠశాలల విలీన ప్రక్రియను, సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ.రమణ, నాయకులు సోమశేఖర్‌నాయుడు, మణిగండన్, సుధాకర్‌రెడ్డి, మునిరత్నం, మెహనబేగం, రాధాకృష్ణ, ఏకాంబరం, సురేష్‌బాబు, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.



**శుభాకాంక్షలు**

టీడీపీ అధికారంలోకి రావడం.. నారా లోకేశ్ భారీ మెజారిటీతో గెలవడంతో ఆదివారం ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ నేత కొల్లూరి ఇందుశేఖర్

## ఏడు మండలాల్లో వర్షం

చిత్తూరు (సెంట్రల్), జూన్ 9: జిల్లాలో శనివారం ఉదయం 9 నుంచి ఆదివారం ఉదయం 9 గంటల వరకు ఏడు మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా వెదురుకుప్పం మండలంలో 11.2 మి.మీ నమోదు కాగా, బంగారుపాళ్యం 6.2, ఐరాల 5.2, చిత్తూరు అర్బన్ 5, కార్వేటినగరం 4.6, గంగాధరనెల్లూరు 4.4, పూతలపట్టులో 2 మి.మీ వర్షపాతం నమోదైంది.

## రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి



పాకాల, జూన్ 9: పాకాల మండల పరిధిలో చిత్తూరు- కర్నూలు జాతీయ రహదారిలో పెరుమాళ్ల గుడిపల్లె వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి చెందాడు. చిత్తూరు జిల్లా చౌడేపల్లెకు చెందిన బన్ని (22) చిత్తూరు ఎస్వీ సెట్‌లో బీటెక్ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. సాయంత్రం ద్విచక్ర వాహనంపై చౌడేపల్లె వెళ్లూ పెరుమాళ్ల గుడిపల్లె సమీపంలో ఎదురుగా వస్తున్న సుమోను ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. పాకాల ఎస్సై మహేష్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అతిసారతో బాలిక మృతి





భవ్య (ఫైల్‌ఫొటో).. దళితవాడలో అధికారుల సహాయక చర్యలు

పుత్తూరు, జూన్ 9: పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని నందిమంగళం దళితవాడలో అతిసార వ్యాధితో భవ్య(12) అనే బాలిక ఆదివారం మరణించింది. ఆ పంచాయతీలో నాలుగు రోజుల కిందట రాజగోపాల్ ఆచారి మృతి చెందిన విషయం తెలిసిందే. పది రోజులుగా ఈ పంచాయతీలోని జనం.. వాంతులు, విరేచనాల బారినపడి ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్సలు పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఈ ప్రాంతాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీహరి, మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి పర్యటించి.. సహాయ చర్యలను చేపట్టారు. తాత్కాలిక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి బాధితులకు చికిత్స అందించారు. ఈ శిబిరం సోమవారం కూడా కొనసాగిస్తామని తెలిపారు. దాదాపు 25 ఏళ్ల నాటి ఇంటి కొళాయి లైన్లను తీసి వేసి.. కొత్తవి అమర్చుతున్నారు. తాగునీటిని కూడా రైతుల పొలం నుంచి తీసుకుని సరఫరా చేస్తున్నారు. తాత్కాలికంగా ప్రతి ఇంటికీ రెండు క్యాన్ల మినరల్ వాటర్ అందించారు. వాటర్ శాంపిల్స్ ల్యాబ్‌కు పంపామని కమిషనర్ పేర్కొన్నారు.

## వైసీపీ నేత ఇంటి పునాదిపై టీడీపీ జెండా



ఇంటి పునాదిపై యువగళం జెండా ఎగురవేస్తున్న టీడీపీ కార్యకర్త

కుప్పం, జూన్ 9: ఐదేళ్ల వైసీపీ పాలనలో పొందిన అవమానాలు, వారిపై జరిగిన దాడులను మరువలేకపోతున్నారు. ఈ క్రమంలో కుప్పం మున్సిపాలిటీ తంబిగానిపల్లె చెక్‌పోస్టు సమీపంలో నిర్మాణంలో ఉన్న వైసీపీ నేత, రెస్కో మాజీ ఛైర్మన్ సెంథిల్‌కుమార్ ఇంటి పునాదులపై టీడీపీకి చెందిన యువగళం జెండాను ఆ పార్టీ కార్యకర్త ఒకరు ఆదివారం ఎగురవేశారు. ఆ వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. 'మా దేవుడికే బాంబేస్తావా? ఇప్పుడు చూడరా, నిన్నేం చేస్తానో? నన్ను కాపాడేదానికి మా దేవుడు లోకేశ్ అన్న ఉండాడు. నిన్ను కాపాడేదానికి పెద్దిరెడ్డి పుడింగి ఉండాడా?' అని మాట్లాడే వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. దీనిపై వైసీపీ నుంచి ఎలాంటి స్పందన రాలేదు.

## శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.90 కోట్లు

తిరుమల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.2.90 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. శనివారం 79,398 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 43,557 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

## ఆగివున్న కారును ఢీకొన్న వ్యాను

- బాలుడి మృతి
- ఇద్దరికి తీవ్ర గాయాలు
- తిరుమలకు వెళుతుండగా ఘటన





నుజ్జునుజ్జయిన కారు, కారులో మృతిచెందిన బాలుడు

బంగారుపాళ్యం, జూన్ 9: చెన్నై- బెంగళూరు జాతీయ రహదారిలోని కేజీ సత్రం వద్ద ఆదివారం ఆగి ఉన్న కారును వ్యాన్ ఢీకొనడంతో బాలుడు మృతిచెందాడు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ మల్లికార్జున కథనం మేరకు.. కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన శివకుమార్, దీప దంపతులు, తెలంగాణ రాష్ట్రం మెదక్ జిల్లా మునిపల్లి గ్రామానికి చెందిన లోకేశ్వర్ తిరుమల శ్రీవారి దర్శనార్థం కారులో బయలుదేరారు. కేజీసత్రం వద్ద రోడ్డు పక్కన కారు ఆపి విశ్రాంతి తీసుకుంటుండగా చిత్తూరు వైపు మామిడికాయల లోడుతో వెళ్తున్న వ్యాను కారును వెనుకవైపు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న లోకేశ్వర్ (12) సీట్ల మధ్యలో ఇరుక్కుని మృతిచెందాడు. దీప, శివ కుమార్‌లకు తీవ్ర గాయాలవడంతో 108 ద్వారా చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. లోకేశ్వర్‌కు సెలవులు కావడంతో మామ శివకుమార్ ఇంటికి వచ్చాడు. సెలవులు ముగియనుండడంతో శ్రీవారి దర్శనం చేసుకుని సొంతూరుకు వెళ్లడానికి సిద్ధమయ్యాడు. దైవదర్శనం చేసుకోకనే మృతిచెందాడు. పైగా రెండో రోజుల్లో ఆ బాలుడి జన్మదినం కూడా ఉండడంతో దాన్ని తలచుకుంటూ కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు.

## భక్తజనసంద్రంగా బోయకొండ





క్యూలైన్లలో వేచియున్న భక్తులు(ఇన్‌సెట్‌లో) ప్రత్యేకాలంకారంలో బోయకొండ గంగమ్మ

చౌడేపల్లె, జూన్ 9: బోయకొండ ఆదివారం భక్తజనసంద్రంగా మారింది. ఉదయం అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి, వేపాకు తోరణలతో అలంకరించారు. అమ్మవారికి అభిషేకాలు అర్చనలు చేసి, స్వర్ణాభరణాలతో, పూలతో అలంకరించి, ధూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక నుంచీ అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. దీంతో అమ్మవారి దర్శనార్థం గంటల కొద్దీ భక్తులు క్యూలైన్లలో నిరీక్షించాల్సి వచ్చింది. ఉదయం 5 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రద్దీ కొనసాగింది. సుమారు 30 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. వివిధ సేవా టికెట్లు, ప్రసాదాల విక్రయాల ద్వారా ఒక్క రోజే రూ.12 లక్షల ఆదాయం చేకూరింది.

## వరసిద్ధుడికి రూ.35 లక్షల విరాళం



ఐరాల(కాణిపాకం), జూన్ 9: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి కర్ణాటక రాష్ట్రం బొమ్మనహళ్లికి చెందిన గోపినాథ్ ఆదివారం రూ.35లక్షలు విరాళంగా అందించారు. ఇందులో అన్నదాన కార్యక్రమానికి రూ.20లక్షలు, గో సంరక్షణ ట్రస్టుకు రూ.15లక్షలు అందించారు. దాతకు ఈవో వెంకటేశు స్వామి దర్శన భాగ్యం కల్పించి, వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించారు. స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## పుంగనూరుకున్న చెడ్డపేరు తొలగించడానికి సహకరించండి



పుంగనూరు స్టేషన్‌లో రాజకీయపార్టీల నాయకులతో మాట్లాడుతున్న డీఎస్పీ విష్ణురఘువీర్

పుంగనూరు, జూన్ 9: రాష్ట్రంలోనే పుంగనూరుకు ఉన్న చెడ్డపేరు తొలగించి ప్రశాంతమైన ఊరుగా తీర్చిదిద్దడానికి అన్ని రాజకీయపార్టీలు సహకరించాలని పలమనేరు డీఎస్పీ విష్ణురఘువీర్ పిలుపునిచ్చారు. ఆదివారం పుంగనూరు పోలీస్‌స్టేషన్‌లో ఆయన తెలుగుదేశం, బీజేపీ, వైసీపీ, తదితర పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ప్రశాంత పుంగనూరుకు తోడ్పడాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే పోలీసులు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ప్రజల తీర్పుతో ప్రభుత్వం మారిందని, గతంలో తమపై తప్పుడు కేసులు, అరెస్టులు, ఇబ్బందులు పెట్టారని ఎవరూ గొడవలకు దిగరాదని సూచించారు. పోలీసులకు ఎవరూ కిరీటం పెట్టరని, నిజాయితీగా పనిచేస్తారని, ఎవరికి సమస్య వచ్చినా తమదృష్టికి తేవాలని సూచించారు. పుంగనూరులో కాంట్రాక్టర్లు, రౌడీషీటర్లు, పెద్దవారి కోసం పోలీసులు అధిక సమయం వెచ్చించరని, పేదల సమస్యలు పరిష్కారించాల్సిన బాధ్యత తమపై ఉండటంతో వారికే ఎక్కువ సమయం ఇస్తామని వివరించారు. 'గతంలో నేను ఇక్కడ పనిచేయలేదు. నేను నిజాయితీగా, నిష్పక్షపాతంగా పని చేస్తా. ఎవరు ఫిర్యాదు చేసినా కేసులు నమోదు చేస్తాం. నిందితులకు శిక్ష పడేలా చేస్తాం. నిజం ఉన్నవారికి న్యాయం జరుగుతుంది. పుంగనూరులో గొడవలు, అల్లర్లు సృష్టించేవారి ధోరణి మారకపోతే చర్యలు కఠినంగా ఉంటాయి. కేసు దర్యాప్తు కోణంలో తేడా ఉంటే అప్పుడు పోలీసులను ప్రశ్నించవచ్చు. ఏ రాజకీయపార్టీల వ్యక్తులు అనవసరంగా గొడవలు, ఘర్షణలకు పాల్పడకుండా పుంగనూరుకు మంచి పేరుతెచ్చేలా ఒక్కమాటపై ఉండాలి' అని డీఎస్పీ సూచించారు. ఈ సమావేశంలో రాజకీయ నాయకులు, సీఐ రాఘవరెడ్డి, ఎస్ఐలు మహ్మద్‌రఫీ, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

## రైతులకు క్వాలిటీ మొక్కలు అందిస్తాం

**సెల్వి కల్చరిస్ట్ యశోదబాయి**



బయోట్రిమ్‌కు కొత్తగా వచ్చిన ఆటో క్లేవ్ పరికరం

మంగళం, జూన్ 9: తక్కువ సమయంలో ఆదాయం వచ్చేలా క్వాలిటీ ఉన్న మొక్కలను రైతులకు అందిస్తామని తిరుపతిలోని బయోట్రిమ్ సెల్వి కల్చరిస్ట్ యశోదబాయి తెలిపారు. ఈ మొక్కలను క్వాలిటీ గల మదర్ ట్రీ ద్వారా ల్యాబ్‌లో డెవలప్ చేస్తున్నామని చెప్పారు. ఇవి తక్కువ నెలలోనే పెరిగి రైతులకు మంచి ఆదాయాన్ని అందించేలా చూస్తున్నామన్నారు. ఇందుకుగాను ల్యాబ్‌లో మరమ్మతులకు గురైన పరికరాలను బాగు చేయించి కొత్తవి తెప్పించినట్లు వివరించారు. ఇప్పటికే దాదాపు 50వేల ఎర్రచందనం మొక్కలను రైతులకు అందించేందుకు సిద్ధం చేస్తున్నామని, వీటితోపాటు టేకు, వెలగ, అడవి నేరేడు, బిల్వ మొక్కలను డెవలప్ చేస్తున్నామన్నారు. అలాగే గార్డెన్లలో పెంచుకునే మొక్కలతోపాటు దాదాపు పదిరకాల మొక్కలను రైతులకు అందించేలా సిద్ధం చేస్తున్నట్లు తెలియజేశారు.

**బయో ట్రిమ్‌కు కొత్తగా మూడు ఆటోక్లేవ్స్**

బయోట్రిమ్‌కు కొత్తగా మూడు ఆటోక్లేవ్స్ పరికరాలు తెప్పించారు. వీటితోపాటు కొన్ని ల్యాబ్‌కు సంబంధించిన పరికరాలు వచ్చాయి. దాదాపు రూ.10లక్షలతో ఈ పరికరాలను తెప్పించారు. అలాగే మరమ్మతులకు గురైన పరికరాలను బాగు చేయించారు.

## రెండవఘాట్‌రోడ్డులో కూలిన వృక్షం



రోడ్డుగా అడ్డుగా పడిన చెట్టును తొలగిస్తున్న సిబ్బంది

తిరుమల, జూన్9(ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి తిరుమలకు చేరుకునే రెండవ ఘాట్‌రోడ్డులో ఆదివారం ఓ భారీ వృక్షం కూలింది. తిరుమలలో ఆదివారం సాయంత్రం భారీ గాలులతో కూడిన స్వల్ప వర్షం కురిసింది. తిరుమలకు సమీపంలోని మూడవ మలుపు వద్ద భారీ వృక్షం రోడ్డుకు అడ్డుగా పడిపోయింది. అదృష్టవశాత్తూ ఆసమయంలో వాహనాలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటన నేపథ్యంలో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. టీటీడీ ఫారెస్ట్, విజిలెన్స్ అధికారులు, సిబ్బంది ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. వేగంగా చెట్లను కట్‌చేసి పక్కకు తొలగించారు. అనంతరం వాహనాలను ముందుకు పంపారు. గత వారంరోజులుగా వర్షం పలు సందర్భాల్లో కురిసిన నేపథ్యంలో ఘాట్‌రోడ్డులో తరుచూ కొండచరియలు విరిగిపడే ప్రదేశాలు, చెట్లు కూలే ప్రాంతాల్లో నిఘా పెట్టారు. అనుకోని ఘటనలు చోటుచేసుకుంటే వెంటనే స్పందించేలా ప్రణాళికలు రూపొందించారు.

## నన్ను ఓడిస్తే దోచుకోవచ్చనుకున్నారు : ఆదిమూలం



సమావేశంలో మాట్లాడుతున్న ఆదిమూలం

వరదయ్యపాళెం/బుచ్చినాయుడుకండ్రిగ,జూన్9: సత్యవేడు నియోజకవర్గంలో వనరులను దోచుకోవడానికే తనను ఓడించాలని ప్రయత్నించారంటూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై కోనేటి ఆదిమూలం ఆరోపించారు. సత్యవేడు టీడీపీ ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయనకు తిరుపతి జిల్లా వరదయ్యపాళెం, బుచ్చినాయుడు కండ్రిగలలో ఆదివారం అభినందన సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిమూలం మాట్లాడుతూ.. నియోజకవర్గంలో వనరులను పెద్దిరెడ్డి ఎలా దోపిడీ చేస్తున్నారో గతంలో జగన్‌కు వివరించానని తెలిపారు. అందుకే తనకు వైసీపీ టిక్కెట్టు ఇవ్వకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. టీడీపీ అధినేత చంద్రబాబును కలిసి పరిస్థితి వివరించగా తనకు పోటీ చేసే అవకాశం కల్పించారన్నారు. పెద్దిరెడ్డి అవినీతిని బయట పెట్టినందుకు ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులకు డబ్బులిచ్చి తన గెలుపును అడ్డుకోవాలని ప్రయత్నించారని విమర్శించారు. అయినా, తనపై నమ్మకంతో ప్రజలు గెలిపించారంటూ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తామని అందరిచేత ప్రతిజ్ఞ చేయించారు. తన విజయం కోసం కృషి చేసిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# చిత్తూరు
## జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

# యాళి వాహనంపై ఉగ్రనరసింహుడు

యాదమరి, జూన్ 9: స్థానిక ఇంద్రవరదుడి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం స్వామివారు ఉగ్రనరసింహుడి అవతార ంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం మూలస్థానంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత ఇంద్రవరదుడికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేశారు. అర్చనానంతరం భక్తులకు దర్శనం కల్పించారు. తర్వాత శ్రీదేవి, భూదేవి సమేత ఇంద్రవరదుడు మత్స్య అవతారంలో సప్పరంలో పురవీధులలో ఊరేగారు. భక్తులు మంగళహారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి స్వామివారు ఉగ్రనరసింహుడి అవతారంలో పురవీధుల్లో ఊరేగారు. యాళి అనే జంతువు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుండటంతో భక్తులు స్వామివారిని వేడుకోగా ఉగ్రనరసింహుడి అవతారంలో లోబరచుకుని అదే జంతువుపై భక్తులకు దర్శనమిచ్చి కాపాడారని పురాణ కథనం. ఈ వాహనాన్ని దర్శించుకుంటే సకల పాపాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. దాంతో పెద్ద ఎత్తున వచ్చి కర్పూర హారతులిచ్చి మొక్కుకున్నారు. సోమవారం ఉదయం సూర్యప్రభ, రాత్రి శేషవాహన సేవలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.




సప్పరంలో ఊరేగుతున్న ఉత్సవమూర్తులు - యాళి వాహనంపై ఊరేగుతున్న ఇంద్రవరదుడు

## ఎంటీఎస్ వారిని విధుల్లోకి తీసుకోవాలి : ఏపీటీఎఫ్

చిత్తూరు (సెంట్రల్), జూన్ 9: మినిమం టైం స్కేల్ కింద నియమితులైన టీచర్లను విధుల్లోకి తీసుకోవాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు చెంగల్రాయ మండడి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. 1998, 2008 డీఎస్సీల్లో అర్హత సాధించిన వారిని మినిమం టైం స్కేల్ కింద 2023 జూన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించి విధుల్లోకి తీసుకున్నారని తెలిపారు. వీరి కాలపరిమితి 2024 ఏప్రిల్ 30 నాటికి ముగిసిందని, జూన్ ఒకటవ తేదీ నుంచి వీరిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## దుర్మార్గ పాలన నుంచి విముక్తి

గంగాధరనెల్లూరు, జూన్ 9: వైసీపీ ప్రభుత్వ దుర్మార్గ పాలన నుంచి రాష్ట్ర ప్రజలకు విముక్తి లభించిందని తెలుగు యువత జిల్లా మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి దేవపత్ని ధనంజయనాయుడు పేర్కొన్నారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో అరాచకం, విధ్వంసాలను చూసిన ప్రజలు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించారని అన్నారు. వైసీపీకి కనీసం ప్రతిపక్ష హోదా రాలేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. టీడీపీ గెలిచిన రోజు నుంచి రాష్ట్రంలో వర్షాలు కురుస్తుండడం సంతోషించదగ్గ విషయ మన్నారు.

## టీడీపీ నేతల సంబరాలు



గంగాధరనెల్లూరు, జూన్ 9: గంగాధరనెల్లూరు ఎమ్మెల్యేగా డాక్టర్ థామస్, చిత్తూరు ఎంపీగా దగ్గుమళ్ల ప్రసాదరావు విజయం సాధించడంతో టీఎన్‌టీయూసీ చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ అధికార ప్రతినిధి జీవరత్నం, టీడీపీ పంచాయతీ కార్యదర్శి సంపత్ ఆధ్వర్యంలో ఆదివారం ఆ పార్టీ నేతలు సంబరాలు చేసుకున్నారు. తూగుండ్రం దళితవాడలోని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేక్‌లు కట్‌చేసి పంచిపెట్టారు.

## వైభవంగా ద్రౌపదీ కల్యాణం



శ్రీరంగరాజపురం, జూన్ 9: మండల కేంద్రంలోని ధర్మరాజస్వామి ఆలయ మహాభారత ఉత్సవాలలో భాగంగా ఆదివారం ద్రౌపదీ కల్యాణం వైభవంగా నిర్వహించారు. గొల్లపల్లి గ్రామానికి చెందిన మాన్యం గీత, సుబ్రమణ్యం నాయుడు ఉభయదారులుగా వ్యవహరించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త వేణు నాయుడు, రాజశేఖర్ నాయుడు, నారాయణస్వామి నాయుడు, కేశవులు నాయుడు, మోహన్ నాయుడు, మాధవ నాయుడు, బ్రహ్మ నాయుడు, సుదర్శన్ నాయుడు, అంజేనేయు నాయుడు, బాలాజీ నాయుడు, ఆనంద నాయుడు పాల్గొన్నారు.

## యువత, మహిళల ఓట్లతోనే కూటమి విజయం



ఓటర్లను సన్మానిస్తున్న చినబాబు

విజయపురం, జూన్ 9: టీడీపీ విజయంలో యువత, మహిళలు కీలక పాత్ర పోషించారని ఆ పార్టీ చిత్తూరు పార్లమెంటు కార్యనిర్వాహక అధికార ప్రతినిధి చినబాబు పేర్కొన్నారు. ఆదివారం విజయపురం మిట్టూరులో విజయోత్సవ సభ నిర్వహించారు. కూటమి గెలుపునకు కృషి చేసిన యువతను, మహిళలను శాలువాలతో సన్మానించారు. అన్నదానం చేశారు. మహారాజపురం, ముత్తప్పరెడ్డికండ్రిగ, కమ్మకండ్రిగ, నారపరాజుకండ్రిగ గ్రామాల్లో అన్నదానం చేశారు. టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చుక్కా ధనుంజయయాదవ్, తెలుగు యువత నేతలు మురళి, దిలీప్, బాగ్యేష్, కార్తీక్, దినేష్, గోవిందరాజులు, చంద్రబాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో పునర్వసు పూజలు

చిత్తూరు కల్చరల్, జూన్ 9: స్థానిక కోదండరామాలయంలో ఆదివారం స్వామివారికి పునర్వసు నక్షత్ర పూజలు చేశారు. ఈవో సుబ్రమణ్యం నాయుడు పర్యవేక్షణలో అర్చకులు వేణుగోపాల్ బృందం స్వామివారికి సుప్రభాతసేవ, సహస్రనామార్చన, వేదపారాయణంతో ప్రత్యేక అభిషేకం చేశారు. విశేషాలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. పూజలనంతరం స్వామి అమ్మవార్లను ప్రత్యేక పల్లకిలో ఊరేగించారు.

## రోడ్డుపై మురుగునీటి ప్రవాహం



చిత్తూరు (సెంట్రల్), జూన్ 9: నగరంలోని టెలిఫోన్ కాలనీ ఎక్స్‌టెన్షన్‌లో నెలల తరబడి రోడ్డుపై మురుగు నీరు పారుతోంది. డ్రైనేజీలు లేకపోవడంతో నీరు రోడ్డుపైకి వస్తోంది. దీంతో ఆ ప్రాంత వాసులు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు దానిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

## రోడ్డు ప్రమాదంలో టీడీపీ నేతకు గాయాలు

పూతలపట్టు, జూన్ 9: మండలంలోని వేపనపల్లికి చెందిన టీడీపీ నేత హేమాద్రి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. తెలుగు యువత చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఆయన స్వగ్రామం నుంచి తిరుపతికి బైక్‌లో వెళుతుండగా చిత్తూరు - తిరుపతి జాతీయ రహదారి కరిణిపల్లి సమీపంలో అదుపుతప్పి రోడ్డుపై పడ్డాడు. తీవ్రంగా గాయపడిన ఆయన్ను స్థానికులు 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వేలూరు సీఎంసీకి తరలించారు. కాగా, హేమాద్రిపై వైసీపీ అల్లరిమూకలు దాడిచేసి, గాయపరిచినట్లు టీడీపీ నేతలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

## బాబు ప్రమాణస్వీకారాన్ని వీక్షించే అవకాశమివ్వాలి

గంగాధరనెల్లూరు, జూన్ 9: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు సీఎంగా ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని పాఠశాలల్లో వీక్షించేందుకు అనుమతులివ్వాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు యుగంధరాచ్చారి కోరారు.





## ఎన్టీఆర్ ఘాట్ వద్ద జీజేఎం నివాళి



చితూరు సిటీ, జూన్ 9: చిత్తూరు ఎమ్మెల్యేగా ఎన్నికైన గురజాల జగన్మోహన్ హైదరాబాదులోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద ఆదివారం నివాళులర్పించారు. కూటమి విజయం సాధించడంతో నివాళులర్పించినట్లు చెప్పారు. పార్టీ చిత్తూరు నియోజకవర్గ పరిశీలకులు పల్లెంటి సునీల్ కుమార్ ఆయన వెంట ఉన్నారు.

## మోదీ ప్రమాణ స్వీకారంలో టీడీపీ జిల్లా నేతలు



చిత్తూరు, జూన్ 9: మోదీ మూడోసారి ప్రధాన మంత్రిగా ప్రమాణ స్వీకార కార్యక్రమంలో జిల్లా టీడీపీ నేతలు పాల్గొన్నారు. ఆదివారం ఢిల్లీలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడితో పాటు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, చిత్తూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్ పాల్గొన్నారు.

## ప్రజాభీష్టం మేరకే పనిచేస్తాం : టీడీపీ



సురేంద్రకుమార్

చిత్తూరు సిటీ, జూన్ 9 : ప్రజల అభీష్టం మేరకే ప్రభుత్వం పనిచేస్తుందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ అన్నారు. ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు సీఎంగా ప్రమాణస్వీకారం చేయకనే అధికార యంత్రాంగం ఆయన ఆలోచనలకనుగుణంగా పనులు చేయడం ప్రారంభించిందని తెలిపారు. మూడు రోజులుగా అమరావతిలో ప్రారంభమైన పనులే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. గడచిన ఐదేళ్లలో మాజీ సీఎం జగన్ తీసుకున్న ప్రజావ్యతిరేక నిర్ణయాలపై చర్చించి, వాటిని మార్చనున్నట్లు చెప్పారు. భూహక్కు చట్టాన్ని రద్దు చేస్తామని చెప్పారు.

## ప్రజలు మార్పు కోరుకున్నారు : టీడీపీ

గంగాధరనెల్లూరు, జూన్ 9: రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడి, సుస్థిరమైన పాలన అందించడానికి ప్రజలు కూటమికి అధికారం కట్టబెట్టారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్రకుమార్ అన్నారు. కూటమి అధికారంలోకి వచ్చినందుకు గంగాధరనెల్లూరు మండలానికి చెందిన పలువురు టీడీపీ నేతలు ఆదివారం సురేంద్రకుమార్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు దేవరాజులునాయుడు, సింగిల్ విండో వైస్ చైర్మన్ నరసింహులునాయుడు, నేతలు హిమగిరినాయుడు, జ్యోతిరెడ్డి, దాము నాయుడు పాల్గొన్నారు.

## రంగమ్మ మృతికి నివాళి



వెదురుకుప్పం, జూన్ 9: మండలంలోని చెన్నుగారి పల్లెకు చెందిన టీడీపీ సానుభూతిపరురాలు, తెలుగు మహిళ జీడీనెల్లూరు నియోజకవర్గ ఉపాధ్యక్షురాలు చిట్టెమ్మ అత్త రంగమ్మ (60) అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి మోహన్‌మురళి, సర్పంచ్ శ్రీనాథరెడ్డి, కంచి ఆనందరెడ్డి అక్కడికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## ముక్కంటి సేవలో కలెక్టర్



శ్రీకాళహస్తి, జూన్ 9: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని కలెక్టర్ షన్మోహన్ కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆలయాధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వదించి, స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## ధ్యానంతో ఇంద్రియ జ్ఞానం పొందవచ్చు




ప్రసంగిస్తున్న ప్రవచనకర్త అరుణ

చిత్తూరు కల్చరల్, జూన్ 9: రోజూ 10 నిమిషాలు ధ్యానమాచరిస్తే ఇంద్రియ జ్ఞానం పొందవచ్చునని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త టి.అరుణ అన్నారు. ఆదివారం గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో సత్యసాయి సోషియల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నామ సంకీర్తనం - జ్యోతిధ్యానం అనే అంశంపై ఒక రోజు సదస్సు నిర్వహించారు. ముందుగా సంస్థాన్ ఆవరణలో సత్యసాయి సంస్థల పతాకావిష్కరణ చేశారు. మండపంలో జ్యోతి ధ్యానం అనే అంశంపై అరుణ ప్రసంగిస్తూ దీపం వెలుగులో జీవితానికి పరమార్థం లభిస్తుందన్నారు. దీపం కాంతిలో ధ్యానం చేయడంతో శరీరంలో అనారోగ్య లక్షణాలు నశించి, ఆరోగ్యవంతులవుతారని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక వక్త పి.సుధారాణి మాట్లాడుతూ భజనలు చేయడమనేది శరీరానికి వ్యాయామంలాంటిదని, ఆరోగ్యానికి సహకరిస్తుందని అన్నారు. సత్యసాయి ఆధ్యాత్మిక ప్రబోధకురాలు సువర్ణాదేవి మాట్లాడుతూ చిన్న వయసు నుంచే ధ్యానం, యోగా, మెడిటేషన్, భజనలు అలవర్చుకుంటే పరిపూర్ణ విజ్ఞానవంతులవడమే కాకుండా అన్ని రంగాల్లో అభివృద్ధి దిశలో ప్రయాణిస్తారన్నారు. భజనమండలి, బాలవికాస్ సభ్యులతో కలిసి యోగా, ధ్యానం, భజనలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

## రామోజీ మృతి పత్రికా రంగానికి తీరని లోటు




నివాళులర్పిస్తున్న ఎంపీటీసీ హరిప్రసాద్ చౌదరి - టీడీపీ నేతలు

గుడిపాల, జూన్ 9: ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు మృతి పత్రికా రంగానికి తీరని లోటని గుడిపాల ఎంపీటీసీ గోళ్ల హరిప్రసాద్ చౌదరి అన్నారు. ఆదివారం ఆయన హైదరాబాద్‌లో రామోజీరావు భౌతికకాయాన్ని సందర్శించి, నివాళులర్పించి, అంతిమయాత్రలో పాల్గొన్నారు.

**రామోజీరావుకు టీడీపీ నేతల నివాళి**

గంగాధరనెల్లూరు, జూన్ 9: ఈనాడు సంస్థల అధినేత రామోజీరావుకు టీడీపీ మండల నేతలు ఆదివారం ఘనంగా నివాళి అర్పించారు. తూగుండ్రం బస్టాండ్ కూడలిలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. టీఎన్‌టీయూసీ నేత జీవరత్నం, టీడీపీ నేతలు నీరజాక్షులురెడ్డి, సంపత్, శ్రీనివాసులుశెట్టి, రాఘవేంద్ర, దినేష్, కమల్, విమల్, నాగయ్య, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముద్దుకృష్ణమ జయంతి




ముద్దుకృష్ణమనాయుడు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నిండ్ర, నగరి నేతలు

నిండ్ర, జూన్ 9: మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమనాయుడు 77వ జయంతి వేడుకలను ఆదివారం నిండ్రలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ప్రజలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశులునాయుడు, విజయ్‌కుమార్, సంపూర్ణమ్మ, రమేష్, మురళీనాయుడు, మహేష్, సురేష్, పెరుమాల్ రెడ్డి, కోటేశ్వరరావు, బాబు తదితరులు పాల్గొన్నారు.

**ముద్దుకృష్ణమకు ఘన నివాళి**

నగరి : స్థానిక టవర్ క్లాక్ వద్ద ఆదివారం ముద్దుకృష్ణమనాయుడు 77 జయంతిని టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. స్వీట్లు పంపిణీ చేశారు. నియోజకవర్గంలో ముద్దుకృష్ణమ పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. టీడీపీ నాయకులు రమేష్‌బాబు, గుణశేఖర్, కృష్ణారెడ్డి, జ్యోతి నాయుడు, ఆనంద్‌రెడ్డి, గోపిరెడ్డి, నారాయణస్వామినాయుడు, ఉమాపతిరాజు లోకనాథం నాయుడు, గాలి రమేష్ పాల్గొన్నారు.

## రోడ్డు పక్కనే మామిడి వ్యర్థాలు



కార్వేటినగరం, జూన్ 9: మండలంలోని అన్నూరు వద్దనున్న జ్యూస్ ఫ్యాక్టరీ యాజమాన్యం మామిడి పండ్ల వ్యర్థాలను కార్వేటినగరంలోని పుత్తూరు-చిత్తూరు జాతీయ రహదారి పక్కనే పడేస్తుండడంతో అవి కుళ్లి దుర్వాసన వెదజల్లుతున్నాయి. తద్వారా వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. ఆ వ్యర్థాలను పశువులు తినడం వల్ల జీర్ణకోశ వ్యాధులకు గురవుతున్నాయని పాడి రైతులు చెబుతున్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.



## నానికి కల్యాణ్ అభినందనలు

బంగారుపాళ్యం, జూన్ 9: చంద్రగిరి ఎమ్మెల్యేగా ఎన్నికైన పులివర్తి నానికి బంగారుపాళ్యానికి చెందిన పారిశ్రామికవేత్త, ఎన్ఆర్ఐ వల్లేరు కల్యాణ్ అభినందనలు తెలిపారు. కుటుంబ సమేతంగా తన ఇంటికి వచ్చిన నానికి కల్యాణ్ కుటుంబ సభ్యులు దుశ్శాలువ కప్పి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మండలంలోని పలువురు టీడీపీ నాయకులు ఆయన్ను సన్మానించారు.

## వైభవంగా వీరాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు

పూతలపట్టు, జూన్ 9: మండలంలోని ఎర్రచెరువుపల్లి దళితవాడలో వీరాంజనేయస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి ప్రారంభమయ్యాయి. స్వామివారికి పాలు, నెయ్యి, చందనంతో అభిషేకం చేశారు. పలు రకాల పూజల అనంతరం గ్రామస్తులు స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు.

## వైభవంగా విరుపాక్షమ్మ తిరునాళ్ల



గంగమ్మను వర్ణిస్తున్న కొండాపురం గ్రామస్తులు

గుడిపాల, జూన్ 9: మండలంలోని శ్రీరంగంపల్లి పంచాయతీ కొండాపురం గ్రామంలో విరుపాక్షమ్మ తిరునాళ్లను రెండు రోజులుగా వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం విరుపాక్షమ్మను గరిగ రూపంలో ప్రత్యేక పుష్పాలతో అలంకరించి మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు కర్పూర హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

## కూటమితోనే దేశాభివృద్ధి : బీజేపీ

గుడిపాల, జూన్ 9: దేశాభివృద్ధి కూటమితోనే సాధ్యమవుతుందని బీజేపీ జిల్లా నాయకుడు చిట్టిబాబు, మండలాధ్యక్షుడు ధనుంజయ నాయుడు, మాజీ అధ్యక్షుడు స్వామినాథ్ గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం వారు మీడియాతో మాట్లాడుతూ గతంలో చేసిన అభివృద్ధి పనుల వల్లే ఎన్డీయే కూటమి గెలిచిందని అన్నారు. రానున్న రోజుల్లో గ్రామీణ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తామన్నారు.

## ఘనంగా ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవం



కార్వేటినగరం, జూన్ 9: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఎస్టీయూ 78వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. మండలాధ్యక్షుడు దేవయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో రాష్ట్రంలో పాఠశాల విద్య బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్టీయూ నాయకులు హమీద్ బాషా, నాగేంద్రరాజు, సర్దార్, శివాజి పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న దుర్యోధన వధ



కార్వేటినగరం, జూన్ 9: మండలంలోని కొల్లగుంట మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన దుర్యోధన వధ కార్యక్రమం ఆకట్టుకుంది. భీముడు, దుర్యోధన పాత్రధారులు ఆలపించిన గీతాలు అలరించాయి. అనంతరం అగ్నిగుండ మహోత్సవం నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు.

## ఘనంగా కొల్లాపురమ్మ తిరునాళ్ల



నిండ్ర, జూన్ 9: స్థానిక ఎస్టీ కాలనీలో ఆదివారం కొల్లాపురమ్మ తిరునాళ్లను ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం మహిళలు అమ్మవారికి పొంగళ్లు పెట్టి, మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి అమ్మవారిని పుష్పాలతో విశేషంగా అలంకరించి పురవీధులలో ఊరేగించారు.

## నేడు ఉచిత కంటివైద్య శిబిరం

బంగారుపాళ్యం, జూన్ 9 : మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 9 నుంచి చెన్నై శంకర నేత్రాలయ ఆధ్వర్యంలో ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మురళీకృష్ణ తెలిపారు. ఆధార్ కార్డు తీసుకురావాలని కోరారు.

# మోదీ ప్రమాణస్వీకారం.. బీజేపీ నేతల సంబరాలు





చిత్తూరు, వెదురుకుప్పం, శ్రీరంగరాజపురంలో బీజేపీ నేతల సంబరాలు

చిత్తూరు (సెంట్రల్), జూన్ 9 : మోదీ మూడోసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయడాన్ని పురస్కరించుకుని ఆదివారం నగరంలో బీజేపీ నేతలు సంబరాలు చేసుకున్నారు. బీజేపీ చిత్తూరు సెంట్రల్ మండలాధ్యక్షుడు షణ్ముగం ఆధ్వర్యంలో 37వ డివిజన్‌లో స్వీట్లు పంచిపెట్టారు. మోదీ ప్రమాణ స్వీకారాన్ని వీక్షించేలా నగరంలో పలుచోట్ల పెద్ద స్క్రీన్స్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ఆనంద్, పూతలపట్టు అధ్యక్షుడు నరసింహానాయుడు, కట్టమంచి మండలాధ్యక్షుడు గోకుల్ యాదవ్ పాల్గొన్నారు.

**వెదురుకుప్పం :** మూడోసారి మోదీ ప్రధాన మంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తున్న నేపథ్యంలో ఆదివారం రాత్రి వెదురుకుప్పంలో కూటమి నాయకులు డప్పులు మేళాలతో సంబరాలు చేసుకున్నారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పి.మోహన్‌మురళి, నాయకులు బండి ఢిల్లీప్రసాదరెడ్డి, బండి విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనాథరెడ్డి, జనసేన పార్టీ మండలాధ్యక్షుడు పురుషోత్తం, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బోడిరెడ్డి హనుమంతురెడ్డి, వెంకటేష్‌రెడ్డి పాల్గొన్నారు.

**శ్రీరంగరాజపురం :** ప్రధానిగా మోదీ మూడోసారి ప్రమాణస్వీకారం చేయడంతో ఆదివారం రాత్రి పుల్లూరు క్రాస్ రోడ్డులో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు రాజేంద్రన్, టీడీపీ మండలాధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, జనసేన నాయకులు సంబరాలు చేసుకున్నారు. బీజేపీ మండలాధ్యక్షుడు జ్యోతిరెడ్డి, టీడీపీ నాయకులు నిరంజన్‌రెడ్డి, హేమాద్రి యాదవ్, జీవన్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు.



నగరిలో బీజేపీ నేతల సంబరాలు

**నగరి :** పట్టణంలోని టవర్‌క్లాక్ వద్ద బాణసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. మూడవసారి నరేంద్రమోదీ ప్రధానమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడం ఆనందదాయకమని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు పొన్నప్పన్, సౌందర్య, పాండ్యన్, రాము, కుమార్, జనసేన మెరుపుల మహేష్, టీడీపీ నాయకులు రమేష్‌బాబు, కృష్ణారెడ్డి, జ్యోతినాయుడు పాల్గొన్నారు.